క్లుప్తంగా

మద్దతుధర సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ప్రభుత్వ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పండించిన పంటలను అమ్మి రైతులు మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నాఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులకు పంటను అమ్మి మోసపోవద్దన్నారు. పీఏసీఎస్ వైస్‌చైర్మన్ కుమ్ర కేశవ్‌రావ్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ మసుద్, పవార్ దుదిరామ్, ఎండీ జహీర్, కొరెంగా సుంకట్‌రావ్, జితేందర్, ఏఎంసీ డైరెక్టర్లు ఇంద్రాబాయి, సిడాం జంగు, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఉన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సంగీత అన్నారు. సోమవారం కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలతో యువత చెడిపోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు ఒక వ్యసనంలా మారి జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. కోఆర్డినేటర్ డాక్టర్ కె.రమేశ్, క్లినికల్ సైకాలజీ శ్రీకాంత్ సకార్వార్, షీటీం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ బి.సుశీల, పి.వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో చేస్తున్న నిర్లక్ష్యం, అలసత్వంపై నిరసనగా సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణలో అలసత్వంతో ఇటీవల విడుదల చేసిన గ్రూప్స్ ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నాయకులు గజ్జల కాంతారావ్, దాసరి రాంప్రసాద్, అందారే బాలాజీ, రోడ్డ నర్సయ్య, రమేశ్, గణపతి, వినయ్ తదితరులు ఉన్నారు.

'మాలలపై దాడులు అరికట్టాలి'



ఎస్పీకి పూలమొక్క అందజేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మాల కులస్తులపై జరుగుతున్న దాడులను అరికట్టేలా చర్యలు చేపట్టాలని మాల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. సోమవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి పూలమొక్క అందజేశారు. వారు మాట్లాడుతూ తమ కులస్తులపై జరుగుతున్న దాడులను అరికట్టడంతో పాటు సత్వరం బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్, బేర దేవన్న, మేకల మల్లన్న, ముచ్చ రఘు, పాశం రాఘవేంద్ర, సింగరి అశోక్, మేదరి స్వామి, మలపతి సుభాశ్, కంటిక పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యాం పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రవీందర్

సిరికొండ: మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను సోమవారం ఎంపీడీవో రవీందర్ ఉపాధి హామీ ఏపీవో భీంరావుతో కలిసి పరిశీలించారు. చెక్‌డ్యాంలతో నీరు వృథా పోకుండా నిల్వ చేయొచ్చని, నాణ్యతతో పనులు చేయాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ స్వరూప, ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వర్ ఉన్నారు.



ఎండిపోయిన మొక్కజొన్న పంట



సాగు నీరు లేక ఎండిపోయిన జొన్న పంట

నీటితడి లేక కంటతడి!



ఏమాయికుంటలో అడుగంటిన బావి



ఎండ తీవ్రతకు అడుగంటిపోతున్న గురుదేవ్ చెరువు

ఎన్నో కష్టనష్టాలకోర్చి సాగు చేసిన పంటలు చివరిదశలో సాగు నీరు లేక ఎండిపోతుండడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. ఎండల తీవ్రతకు ఇంద్రవెల్లి మండలంలోని చెరువులు, బావుల్లోని నీరు అడుగంటుతుండడంతో రైతులు యాసంగిలో వందల ఎకరాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని ఏమాయికుంట సమీపంలో ఉన్న గురుదేవ్ చెరువు అడుగంటిపోయి కెనాల్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆయకట్టులో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, శనగ, గోధుమ పంటలు ఎండిపోయాయి. ఏమాయికుంట, కేస్లాగూడ, అంజీ, వడగామ్, ముత్నూర్, కేస్లాపూర్, దస్నాపూర్, హర్కపూర్, వాల్గోండ, హీరపూర్ గ్రామాల్లో కూడా ఎండల తీవ్రతకు బావులు, బోర్‌వెల్‌లో భూగర్భజలాలు పాతాళానికి చేరుకున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని వేడుకుంటున్నారు. - ఇంద్రవెల్లి

'గిరిజన గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి'



సీసీరోడ్డుకు భూమిపూజ చేస్తున్న గణేశ్‌రెడ్డి

తలమడుగు: గిరిజన గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పూనగుడ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి రూ.కోటి 80లక్షల నిధులతో సీసీరోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, బాపన్న, మాజీ వైస్‌ఎంపీపీ దివ్య మాధవ్, గ్రామ పటేల్ లక్ష్మణ్, సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, రాములు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

బోథ్: యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం సొనాల, మండలంలోని టీవీటీ గ్రా మంలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా యువకులకు టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. సుధీర్ రెడ్డి, సోమన్న మునేశ్వర్, భీంరావ్ పాటిల్, హరీశ్, నరేందర్, చిన్నయ్య, అఖిల్, యువకులు పాల్గొన్నారు.

బోథ్‌కు బస్సు వేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న వీడీసీ సభ్యులు

బోథ్: హైదరాబాద్ నుంచి బోథ్ నియోజకవర్గ కేంద్రానికి బస్సు వేయాలని బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ అల్లకొండ పోతన్న, వీడీసీ సభ్యులు సోమవారం బోథ్‌కు వచ్చిన నిర్మల్ డీఎం ప్రతిమరెడ్డికి వినతిపత్రం అందించారు. హైదరాబాద్ నుంచి బస్సు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన..

మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రహరీ నిర్మాణ పనులను నిర్మల్ డిపో డీఎం ప్రతిమ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్థలం విస్తీర్ణంపై చర్చించారు. ప్రహరీ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు.

విమానాశ్రయానికి బస్సు సర్వీసులు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ డిపో నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నూతనంగా బస్సు సర్వీసులు ప్రారంభించనున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు రెండు రాజధాని ఏసీ సర్వీసులు విమానాయాశ్రయానికి బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఒక సర్వీస్ మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమై రాత్రి 10 గంటలకు చేరుకుంటుందని, మరో సర్వీస్ రాత్రి 9.30 గంటలకు బయలుదేరి, ఉదయం 4.30 గంటలకు చేరుకుంటుందని వివరించారు. తిరుగు ప్రయాణంలో ఎయిర్‌పోర్ట్ నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 12 గంటలకు, ఉదయం 11.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 6.40 గంటలకు ఆదిలాబాద్‌కు చేరుకుంటాయన్నారు. మంగళవారం నుంచి ఈ సేవలు ప్రారంభమవుతాయని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ గెజిటెడ్ నంబర్1 ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంతోపాటు పాఠశాల వార్షికోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో డి.సోమయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు డి.నీలాదేవి, ఉపాధ్యాయులు సి. సుకుమార్, ఎస్.యాదగిరి, బి.ప్రశాంత్, కె.దీపక్ కుమార్, గౌస్ మొయినుద్దీన్, సంధ్యారాణి, నవీన, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అనురాధ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

వంట పాత్రలు పంపిణీ

బజార్‌హత్నూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈవో కిషన్‌గుప్తా ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం వంట పాత్రలను, ఇతర వంట సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన వంటపాత్రలను మండలంలోని 55 పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు భూమన్న, లక్ష్మీకాంత్, ఆత్మారాం, పరమేశ్వరి, మహేశ్, ఎంఐసీ చట్ల శరత్, సీసీవో ప్రతిభ, సీఆర్పీలు చట్ల విజయలలిత, అర్క రాందాస్ పాల్గొన్నారు.

ఎంఈవో విచారణ

బోథ్: సొనాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బోథ్ ఎంఈవో మహమ్మద్ సోమవారం విచారణ చేపట్టారు. ఇటీవల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయలోపంతో సమస్యలు తలెత్తడంతో, గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంఈవో మహమ్మద్ పాఠశాలలో విచారణ చేపట్టారు. ఉపాధ్యాయులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు ఆయన తెలిపారు.

'ఎమ్మెల్యే చెప్పేవి అబద్ధాలు'

బోథ్: అసెంబ్లీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అబద్ధాలు మాట్లాడుతున్నారని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు అరకొర వసతులతో నడిచాయన్నారు. ఎమ్మెల్యే అసెంబ్లీలో ఇచ్చోడ మండల కేంద్రంలో ఆశ్రమ పాఠశాలలో చనిపోయిన విద్యార్థి లాలిత్య పాముకాటుతో మృతి చెందిందని అబద్ధాలు మాట్లాడటం విచారకరమన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, షేక్ షాకీర్, కేంద్రే మాధవ్‌రావు, నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

పోస్టులు పెట్టేవారిపై చర్యలు తీసుకోవాలి

బేల: సీఎం రేవంత్‌రెడ్డిని కించపర్చే అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సామ రూపేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై దివ్యభారతికి ఫిర్యాదు చేశారు. బాపురావు, కన్యరాజు, విజయ్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: రేవంత్ రెడ్డిపై సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఏ ఖయ్యూమ్ అనే వ్యక్తి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. రవి పులుగు ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ యూకే అనే ఖాతా నుంచి పోస్టు చేశారని ఆయన తెలిపారు.

ఇఫ్తార్ విందు

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ మాసం సందర్భంగా బెస్ట్ ఫ్రెండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ఉర్దూఘర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

14 ఇళ్లకు మార్కవుట్

ఇచ్చోడ: మండలంలోని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన నవేగావ్ గ్రామంలో 14 ఇళ్లకు మార్కవుట్ ఇచ్చినట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. 87 మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. మిగితా ఇళ్లకు త్వరలోనే మార్కవుట్ ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

బోథ్: వాహనదారులు, డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ వెంకటేశ్వర రావు అన్నారు. సొనాల మండల కేంద్రంలో వాహనదారులకు, డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. ఇన్సూరెన్స్, వాహనాలను నడిపే వారికి లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన కలప పట్టివేత



అటవీ శాఖ అధికారులు పట్టుకున్న కలప

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో సోమవారం దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు బోథ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణయ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు గ్రామంలో సోదాలు నిర్వహించగా ఇద్దరి ఇళ్లలో అక్రమంగా కలప నిల్వ ఉండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. దాడుల్లో సొనాల డీఆర్‌వో అ మర్ సింగ్, ఎఫ్‌ఎస్‌వో నాగోరావు, ఎఫ్‌బీవోలు విఠల్, అనిల్, రాధేశ్యాం, ధన్‌రాజ్‌లు ఉన్నారు.

మామూళ్ల మత్తులో విద్యుత్ అధికారులు!

నేరడిగొండ: విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇటీవల దేవుల్‌నాయక్ తండాలో ఓ గృహం పైనుంచి వెళ్తున్న ఎల్‌టీలైన్ క్రాసింగ్ ఉండడంతో పనులను నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టి బాధితుడి నుంచి రూ.30వేలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నాగమల్యాల్ గ్రామంలో 30 మంది రైతుల వద్ద నుంచి రూ.3 లక్షల వరకు డబ్బులు తీసుకొని వ్యవసాయ భూముల్లో విద్యుత్ సరఫరా చేసినట్లు తెలుస్తోంది. రోల్‌మామడ, గుత్పాల, బోరిగాం, గోవింద్‌పూర్, శంకరాపూర్, కిష్టాపూర్ తదితర గ్రామాలకు చెందిన రైతుల వద్ద ఓ విద్యుత్ శాఖ అధికారి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. కాగా ఈ విషయమై విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణను 'సాక్షి' వివరణ కోరగా.. సంబంధిత అధికారులకు తెలిపి విచారణ చేపట్టిన అనంతరం చర్యలు తీసుకుంటామని వివరించారు.

పూర్తిగా వెలగని హైమాస్ట్ లైట్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద హైమాస్ట్‌లైట్లు వెలుగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడ ఉన్న ఎనిమిది లైట్లలో కేవలం రెండు లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. దీంతో బైపాస్ వద్ద చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పంట వివరాలు నమోదు



పంట చేనులో రైతు ఫొటో తీస్తున్న అధికారి

సిరికొండ: రైతులు తమ పంటలను ప్రభుత్వానికి మద్దతు ధరకు విక్రయించాలంటే డిజిటల్ క్రాప్ బుకింగ్ యాప్‌లో పంట సాగు వివరాలు ఆన్‌లైన్ చేయాలని ఏఈవో ప్రవీణ్ తెలిపారు. మండలంలోని సోన్‌పెల్లి శివారులో సోమవారం పర్యటించి రైతుల పంటల సాగు వివరాలను ఆన్‌లైన్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'భయం వీడితేనే విజయం'



మాట్లాడుతున్న జీసీడీవో మెస్రం ఛాయ

నేరడిగొండ: విద్యార్థులు భయం వీడితేనే జీవితంలో విజయం సాధ్యమవుతుందని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. సోమవారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కూరగాయల సాగు తీరును పరిశీలించారు. ఆమె వెంట ప్రధానోపాధ్యాయుడు అంబరావు ఉన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'

తలమడుగు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఖోడద్, ఉండం గ్రామాల్లో రూ.13 లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ప్రకాశ్ రమాకాంత్, పిడుగు అభిరామ్‌రెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహులు, ఆనంద్, గంగాధర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తాంసి: మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద వేసవి దృష్ట్యా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం పార్టీ నాయకులు, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్

నార్నూర్: ఉపాధిహామీ పథకంలో భాగంగా 2023–24 సంవత్సరంలో నిర్వహించిన పనులకు సంబంధించి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్ హాజరయ్యారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలోని పనులను సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో ఎవరు అక్రమాలకు పాల్పడినా, కూలీల డబ్బులు స్వాహా చేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 23 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం రూ.9,32,62,235 విలువైన పనులు చేపట్టారన్నారు. ఈ పనులను గ్రామసభల ద్వారా నిర్ధారించామన్నారు. ఇందులో రూ.18,350 టీఏలు, ఎఫ్ఏలకు జరిమానా విధించడంతో పాటు రూ.84,312 రికవరికి ఆదేశించినట్లు తెలిపారు. ఏపీడీలు కుటుంబరావు, కృష్ణారావు, అంబుడ్స్‌మెంట్ అధికారిణి వీణ, ఎంపీడీవో జవహర్‌లాల్, ఎంపీవో జాదవ్ సురేశ్, ఈసీ రాథోడ్ సురేందర్, అధికారులు పాల్గొన్నారు.

శివాజీ మహరాజ్ చరిత్ర స్ఫూర్తిదాయకం



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జోగు రామన్న

బేల: ప్రతి ఒక్కరికి శివాజీ మహరాజ్ జీవిత చరిత్ర స్ఫూర్తిగా నిలుస్తోందని రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోనాల గ్రామంలో యువకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఐక్యంగా ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువత మహనీయుడి పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, నాయకులు సతీశ్‌పవార్, జక్కుల మధుకర్, దేవన్న, రావుత్ విఠల్, కోడే విపిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



కల్యాణ మహోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో గల శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాలకు సంబంధించిన ఏడో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం శ్రీ రమాదేవి శ్రీ సత్యనారాయణ స్వామి వార్ల కల్యాణం వైభవంగా చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. గుడి ధర్మకర్తలు వెంకటరెడ్డి, రాములు, పవన్ నాయక్, శ్రీకాంత్ విజయ రావు, కర్ల రాములు, భగవాన్ రావు, అశోక్, గిరిధర్ రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల పింఛన్ పెంచి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా అధ్యక్షుడు నగేశ్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చే రూ. 300 పెన్షన్‌ను రూ.3వేలకు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు ఆరీఫా, ఆశన్న పాల్గొన్నారు.

సీపీఐ రిలే దీక్షలు..

పట్టణ శివారులో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న నిరుపేదలకు ఇంటి పట్టాల జారీతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు ముడుపు నళినిరెడ్డి డిమాండ్ చేశారు. 170 సర్వేనంబర్, నిషాన్‌ఘాట్ కాలనీల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్‌తో సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 12 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. విద్యుత్, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నాయకులు కావ్య, లక్ష్మి, వెంకటమ్మ, పుష్ప, శారద తదితరులు పాల్గొన్నారు.

ఆశల ధర్నా..

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.18వేల కనీస వేతనం చెల్లించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 19న కలెక్టరేట్ దిగ్బంధనం, 24న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు చేపడుతామన్నారు.